# పాపం జ్యోత్స్న!

— శ్రీమతి శేషూ అప్పారావ్
టొరంటో, కెనడా

చెక్కిట చెయ్యి వేసుకుని దీర్ఘాలోచనలో వుంది జ్యోత్స్న. కోపంతో ఆమె కళ్ళు కొద్దిగా ఎరుపెక్కాయి. చిరుచెమటతో నుదుటనున్న తిలకం కొద్దిగా కరిగింది. అందమైన నల్లటి ముంగురులు మొహంమీద చిందరవందరగా హత్తుకుని వున్నాయి. పొడుగాటి నల్లటి వాల్జెడ ముందుకు వేసుకుని కుడిచేత్తో గిరగిరా తిప్పుతోంది. కుడికాలి బొటన వేలుతో నేలమీద అసహనంగా రాస్తోంది.

ఒక్క మాటలో చెప్పాలంటే బాపు బొమ్మకి ప్రాణం వచ్చి కోపగిస్తే ఎలా వుంటుందో... అక్షరాలా అలాగే వుంది జ్యోత్స్న. తన సమస్య చెబితే ఇరుగూ పొరుగూ ఆడవాళ్ళు సానుభూతి చూపలేదు సరికదా, పకపకమని నవ్వారు.

అలనాటి సీతా, ద్రౌపదీ, అనసూయా, సుమతీ.... అంతా తనకంటె ఎంతో అదృష్టవంతులనిపించింది జ్యోత్స్నకి. వాళ్ళ జీవితాలకో ఛాలెంజ్ వుంది. తరతరాల భారత ప్రజల సానుభూతి వుంది. తనకో! సానుభూతి మాట అటుంచి కనీసం ఎవరూ నవ్వకపోతే అంతేచాలు!

"మా ఆయన పెళ్ళి అయ్యేవరకి సిగరెట్ మీద సిగరెట్ కాల్చేవారు. ఈ రోజు ఒక్క సిగరెట్ కూడా కాల్చరనుకో. నా పట్టుదలా, నేర్పరి తనంతో ఆయన్ని ఒక దారిలో పెట్టాను." ఎదురింటి వనజ ఎంతో గర్వంగా చెబుతుంది.

హు! తనకా మాత్రం ఛాలెంజి కూడానూ .... విక్రమ్‌కి సిగరెట్ పట్టుకోవడంకూడా సరిగారాదు. శుద్ధ దద్దమ్మలా పెంచారు వాళ్ళ తల్లి తండ్రులు. ఆ క్షణంలో అత్తమామలమీద చాలా కోపం వచ్చింది జ్యోత్స్నకి.

"మా ఆయన వట్టి బద్ధకస్తుడు అనుకో! ఎక్కడ విడిచిన బట్టలు అక్కడే వదేస్తారు. ఎక్కడ చదివిన న్యూస్ పేపరు అక్కడే వదేస్తారు. ప్రతీపనికీ చిన్న పిల్లాడికంటెకూడా ఘోరంగా నామీద ఆధారపడతారు" గర్వంగా వర్ణించి చెబుతుంది మొగుడి బద్ధకాన్ని ప్రాణ స్నేహితురాలు పద్మ.

ఖర్మ! తనకా అదృష్టం కూడా నా! విక్రమ్‌కి అతి శుభ్రం. అన్నీ తనకంటే కూడా పద్ధతిలో చక్కగా వుంచుతాడు. ఏ రకంగానూ తన మీద ఆధారపడడు. తనే ఇల్లు ఏమైనా గజిబిజిచేస్తే చక్కగా సర్దుతాడు. తను పుట్టింటికి వెళ్ళి నెల రోజులు ఉండి ఇంటికి వచ్చేసరికి. అద్దంలా వున్న ఇల్లు చూసి ఆశ్చర్యపోయింది.

"మా ఆయనకి ఇంటిఖర్చులూ, లెక్కలు వెయ్యడం, బ్యాంకు పనులూ అవీ చెయ్యడం ఇష్టం వుండదు. జీతం తెచ్చి నా చేతి లో పోస్తాడు. నా జీతం, ఆయన జీతం అంతా తెలివిగా నేనే మేనేజ్ చేస్తాను" తను ఎంత తెలివిగా డబ్బు సేవ్ చేస్తుందో ప్రతి నెలా చెబుతూంటుంది కొలీగ్ వసంత.

ఛీ! తన విషయం గుర్తువస్తే సిగ్గుచేటు. డబ్బు వ్యవహారాలన్నీ చూసుకుంటానని చెప్పి రెండు నెలలు కూడా మేనేజ్ చెయ్యలేక తిరిగివిక్రమ్ చేతుల్లో పెట్టింది జ్యోత్స్న.

"నేను చూసుకుంటాలే ఇవన్నీ!" కొంటెగా నవ్వుతూ అన్నాడు విక్రమ్. ఆ నవ్వు చూస్తే తనకు ఉక్రోషం. అన్నీ తనకే బాగా చెయ్యడం వచ్చని గర్వం!

స్నేహితుల జీవితాలతో పోల్చిచూసుకుంటే తన జీవితం ఎంతో నిస్సారంగా అనిపిస్తోంది జ్యోత్స్నకి.

ఒకరకంగా చూస్తే తప్పంతా తనదే అనిపిస్తోంది జ్యోత్స్నకి. పెళ్ళికి ముందు విక్రమ్‌తో ఎన్నో విషయాలు చర్చించింది. తను అడుగు పెట్టబోయే ఇంటికి ఆడా, మగా పనులంటూ తేడా ఏమీ వుండకూడదని



# ఛాయాచిత్ర

## గ్రామీణ, నగర జీవిత (ఛాయా) చిత్రణ

గ్రామీణ జీవితం నగర జీవితానికి పూర్తిగా భిన్నం. గ్రామం తల్లి అయితే నగరం ప్రేయసి. తెలుగు గ్రామీణ జీవిత సౌందర్యాన్ని ప్రతిబింబించే ఛాయాచిత్రాలను అమెచ్యూర్ ఫొటోగ్రాఫర్ నుంచి ఆహ్వానిస్తున్నాము. అలాగే నగర జీవితాన్ని విశ్లేషించే ఛాయాచిత్రాలను కూడా అమెచ్యూర్ ఫొటోగ్రాఫర్ల నుంచి ఆహ్వానిస్తున్నాము. ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక సంపాదకవర్గం ఎన్నికచేసే ఉత్తమ ఛాయాచిత్రాలను వరుసగా ప్రకటించి నగదు బహుమతులతో సత్కరిస్తాము. ఫొటోలు పంపవలసిన ఆఖరు తేదీ 31 మార్చి 1984.

ఫొటోగ్రాఫర్లు తమ ఫొటోలను తగు తిరుగు తపాలాబిళ్ళలను చేర్చి, స్వంత చిరునామాకల కవర్లను జతచేసి పంపాలి.

ఫొటోలను పోటీకి పంపవలసిన చిరునామా:

ఎడిటర్,
ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక,
పోస్ట్‌బాక్సు నెం. 712, విజయవాడ–520 010

—ఎడిటర్

చెప్పింది. ప్రతి పనీ చెయ్యడానికి మొగుడు సిద్ధంగా వుండాలని చెప్పింది. భార్యని అన్ని విషయాల్లో సమానంగా చూసి, సాటి మనిషిగా గౌరవించాలని కోరింది. ఉమన్స్ లిబరేషన్ వగైరాలన్నీ ఎంతో చక్కగా చర్చించింది విక్రమ్‌తో. తన ఆశయాలకి ప్రతి రూపమని భావించిన విక్రమ్‌తో జీవితం ఇంత నిస్సారంగా వుంటుందని జ్యోత్స్న ఎప్పుడూ అనుకోలేదు.

విక్రమ్ అన్ని విధాలా తన మాట నిలబెట్టుకున్నాడు. తనే విక్రమ్‌తో సమానంగా అన్ని పనులూ చెయ్యలేకపోతోంది. ప్రతి పనికీ మొగుడుమీదే ఆధారపడుతున్నట్లు ఫీలవుతోంది. తన మీద విక్రమ్ దేనికీ ఆధారపడకపోవడం చాలా బాధగా వుంది జ్యోత్స్నకి.

అన్నిటినీ మించిన నిన్నటిసంఘటనతో జ్యోత్స్న కోపం తారస్థాయికి చేరుకుంది. విక్రమ్ వంట బాగా చేస్తాడు గానీ ఊరగాయలుపెట్టే విషయంలో మటుకు ఎపుడూ ఆసక్తి చూపలేదు. ప్రతీసారీ చక్కగా ఊరగాయలు పెట్టి భర్తనుంచి అభినందనలు అందుకుంటుండె జ్యోత్స్న. ఈ ఒక్క విషయంలో అయినా తనది పైచెయ్యిగా వున్నందుకు సంతోషంగావుండె జ్యోత్స్నకి. ఎప్పటిలాగే నిన్న కూడా మామిడికాయలు కడిగి తుడిచిపెట్టింది జ్యోత్స్న. ఊరగాయలపుస్తకంలో కొలతలు చూస్తుంటే ...

"కాస్సేపు అలా షాపింగ్‌కి వెళ్ళి, తరువాత సినిమాకికూడా వెడదాంరా జ్యోత్స్నా" అంటూ వచ్చింది స్నేహితురాలు వనజ.

"కాస్సేపు నువ్వుకూడా సరదాగా అలా వెళ్ళిరా జ్యోత్స్నా! నేను ఎలాగూ కొంత ఆఫీసు పని చూసుకోవాలి" అన్నాడు విక్రమ్. శనివారం మూలంగా ఇంట్లోనే వున్నాడు విక్రమ్. స్నేహితులతో షాపింగ్‌కీ, సినిమాలకీ వెళ్ళి చాలా రోజులైంది కదా అని వెళ్ళడానికి సిద్ధపడింది జ్యోత్స్న.



ఇంటికి రాగానే విక్రమ్ అవతారాన్ని చూస్తే కోపం, నవ్వూ రెండూ వచ్చాయి జ్యోత్స్నకి. హోమ్, స్వీట్‌హోమ్ అని అక్షరాలున్న తన కిచెన్ ఏప్రన్ మెడ చుట్టూ కట్టుకుని, హడావుడిగా కుక్‌బుక్‌లోకి రిఫర్ చేస్తూ ఆవకాయ కలిపేస్తున్నాడు విక్రమ్. "చూడు జ్యోత్స్నా! నీకు నచ్చిందో, లేదో" అంటూ కారంతోవున్న ఆవకాయ ముక్క జ్యోత్స్న చేతుల్లో పెట్టాడు. రుచి అమోఘంగా వుంది. అమ్మ పెట్టే ఊరగాయ జ్ఞాపకం వచ్చింది జ్యోత్స్నకి. కానీ విక్రమ్‌ని అభినందించాలనిపించలేదు. అన్ని రంగాల్లోనూ పైచెయ్యిగా వుంటున్న విక్రమ్‌మీద చాలా కోపం వచ్చింది. భోజనం మానేసి, అపర సత్యభామలా అలకాగృహం ప్రవేశించింది జ్యోత్స్న.

తన తప్పేమిటో విక్రమ్‌కి అర్థం కాలేదు. ఇంటికొచ్చేసరికి పనులు పూర్తి చేస్తే భార్య సంతోషిస్తుందనుకున్నాడు. "ఏమిటో ఈ ఆడవాళ్ళు!" అంటూ నిట్టూర్చాడు.

పక్కమీద అసహనంగా దొర్లుతూ 'హు! కాస్త మామూలు తెలుగబ్బాయిని పెళ్ళి చేసుకుని వుంటే నా తెలివి, పనీ అవీ కాస్త కన్పించేవి. విక్రమ్‌ని పెళ్ళి చేసుకుని తప్పుపని చేశాను. ప్రతీ పనిలోనూ దద్దమ్మలా ఫీలవుతున్నాను' అనుకొంది జ్యోత్స్న.

నిన్నటినుంచీ ఆలోచిస్తున్నా ఎంతకీ తన సమస్యకి పరిష్కారం కన్పించడం లేదు. ఒక్క విషయంలోనైనా విక్రమ్‌కి పైచేయిగా వుండాలి. విక్రమ్‌కి చేతకాని పనులు కూడా వుంటాయని నిరూపించాలి. అప్పుడు విక్రమ్‌కి కాస్త గర్వం తగ్గుతుంది. తనకు మనశ్శాంతి కలుగుతుంది. ఆలోచించగా, ఆలోచించగా జ్యోత్స్నకి మంచి ఐడియా వచ్చింది.

* * *

సాయంకాలం విక్రమ్ ఇంటికివచ్చేసరికి చక్కగా ముస్తాబై బెడ్‌మీద కూర్చుని మల్లెమొగ్గలు మాలకడుతోంది జ్యోత్స్న.

ఇంటికి కాస్త బెరుకుగా వచ్చిన విక్రమ్‌కి ఇంట్లో ప్రశాంత వాతావరణం, అప్సరసలా ముస్తాబై మల్లెపూలు కడుతున్నభార్య ఎంతో సంతోషం కలగజేశాయి.

"నువ్వు ఎంత అందంగా వున్నావో తెలుసా? మన కవులు వర్ణించే శృంగార

నాయికల్లా వున్నావు." కొంటెగా నవ్వుతూ జ్యోత్స్న పక్కనే బెడ్ మీద కూర్చున్నాడు విక్రమ్.

"చాల్లెండి! ఎంతకైనా తగుదురు మీ మగవాళ్ళు" చిరుకోపం నటిస్తూ అంది జ్యోత్స్న.

చకాచకా, నేర్పుగా, నాజూగ్గా మల్లెమొగ్గలని చేతుల్లోకి తీసుకుని దారంతో ముడులు వేస్తూ అందమైన పూలమాల తయారు చేస్తున్న భార్యని తన్మయత్వంతో చూస్తూ-

"మాకేమైనా కాఫీ, ఫలహారాలున్నాయా? కాస్త కడుపు నిండితే నీ మీద ఇంకాస్త కవిత్వం చెబుతాను" చిలిపిగా అన్నాడు విక్రమ్.

అక్కడే కడుతున్న మాలా, పువ్వులూ వుంచి కాఫీ, ఫలహారాలు తీసుకురావడానికి లోపలికి వెళ్ళింది జ్యోత్స్న.

కాఫీ కప్పు విక్రమ్ చేతికిచ్చి మళ్ళీ పూలమాల కట్టడంలో నిమగ్నమైంది జ్యోత్స్న.

"నీలా ఎప్పటికీ ఇంత నేర్పుగా పూలమాల నేను కట్ట లేను" సంభ్రమంగా ఆమె మాల కట్టే పద్ధతిని చూస్తూ అన్నాడు విక్రమ్.

"ఇప్పటికైనా ఒప్పుకోండి. మీరు చెయ్యలేని పనులు కూడా వుంటాయి. నన్ను దీంట్లో మీరు బీట్ చెయ్యలేరు." విజయోత్సాహంతో అంది జ్యోత్స్న పూలవైపు చూస్తూ.

కొద్దిగా పూలు తగ్గినట్లు అనిపించింది. తను చాలా మొగ్గలు కొంది. ఇంతమటుకు ఒక బారెడు మాలమాత్రమే కట్టింది.

అదేమాట విక్రమ్‌ని అడిగింది.

చిలిపిగా బెడ్ వైపు చేయిపెట్టి చూపించాడు.

అక్కడక్కడా మల్లెమొగ్గలు బెడ్ మీద పరిచి వున్నాయి. జ్యోత్స్న బుగ్గలు కెంపులయ్యాయి.

చిలిపి తగవులు మరిచిపోయి ఒక్కటైనారు వాళ్ళిద్దరూ ఆ క్షణంలో.

* * *

"బారెడు దండ చక్కగా కట్టి పక్క మీద పడేశారేమిటమ్మా" అంటూ వచ్చిన అప్పలమ్మ చేతిలోని దండని చూసి నిర్ఘాంతపోయింది జ్యోత్స్న.


"ఇంక ఈ విక్రమ్‌ని ఓడించడం అనే మాట మరిచిపోయి నా బుర్రని మరో వైపుకి తిప్పుకుంటేగానీ లాభం లేదు" అనుకుని నిట్టూర్చింది జ్యోత్స్న.

అప్పలమ్మా, జ్యోత్స్నల సంభాషణ విన్న విక్రమ్ జ్యోత్స్నకి కనిపించకుండా స్కూటరెక్కి బజారుకు పారిపోయాడు- "జ్యోత్స్నని ఎలా ఎదుర్కోవాలా?" అనుకుంటూ.

# నాటకరంగ హరిశ్చంద్రుడు శ్రీ మల్లాది నిష్క్రమణ

సాత్త్వికము, వాచికము, ఆంగికము, ఆహార్యకము అనే చతుర్విధాభినయాల్లో పరమోత్కృష్టమైనది సాత్త్వికము. అందులో నిష్ణాతులైన నటుల్ని ఏ కొద్దిమందినో చూస్తాం. వారిలో మల్లాది సూర్యనారాయణగారు (66) ఒకరు.

అసలు మల్లాది సూర్యనారాయణగారనగానే హరిశ్చంద్ర నాటకమో, హరిశ్చంద్ర నాటకం అనగానే మలాది సూర్యనారాయణగారో, నాటకాలు చూడటం బాగా అలవాటున్న ఏ తెలుగు వాడికయినా జ్ఞప్తికి రాకమానదు. ఆయన ఆ పాత్రని అంతగా తన సొంతం చేసుకున్నాడు. రావణ, కృష్ణ, కర్ణ, అర్జున, చారుదత్త, నల, బాహుక, బృహన్నలాద్యాది పాత్రలెన్ని పోషించినా, ఆయనని నటుడుగా ఆంధ్ర ప్రజానీక హృదయాలలో నిలిపింది ఆ 'హరిశ్చంద్ర' పాత్రే మరి!



ఒక్క మల్లాది సూర్యనారాయణగారు, తన ఏభై ఏళ్ళు పైబడిన నట జీవితంలోనే ఐదారు వేల ప్రదర్శనలిచ్చాడు. అందులో మూడువేలకి పైగా హరిశ్చంద్రుడే!

తన పన్నెండవ ఏటనే రామదాసు నాటకంలో, రామదాసు కుమారుడైన రఘురాముడి పాత్రతో రంగప్రవేశం చేసిన శ్రీ మల్లాది, దరిదాపు చనిపోయేవరకు (22-2 1984) నటిస్తూనే వున్నారు. మొదట్లో ఆయన కీర్తిశేషులు డి. వి. సుబ్బారావుగారి సమాజంలో, ధర్మరాజు, దుర్యోధనుడు పాత్రలు నటిస్తూ వుండేవారు. ఆ రోజుల్లో వీరి అభినయం చూచిన నవ్యాంధ్ర నాటకరంగ ఆచార్యుడనదగిన శ్రీ తాడిపత్రి రాఘవాచార్యులు (బళ్ళారి రాఘవ) గారు ఎంతో మురిసిపోయి, ప్రత్యేకంగా "గ్రీన్ రూమ్"లోకి వచ్చి మరీ అభినందించాడట!

తరువాత అన్నగారైన మల్లాది లక్ష్మీనారాయణగారు నిర్వహించిన "ఆంధ్ర డ్రమెటిక్ అసోసియేషన్"లో తమ్మెను శివరామ్ రచించిన "స్వతంత్ర భారత్" నాటకంలో విప్లవ భావపరిపూరితుడైన "తాత" పాత్ర, "దేశద్రోహి" నాటకంలో "ఓంచంద్" పాత్ర నటించాడాయన.

నేటి సినీరంగ ప్రముఖుడైన శ్రీ మాధవపెద్ది సత్యం, శ్రీ వెంపటి చిన సత్యం, శ్రీ గుబ్బారి శేషగిరిరావు గార్లు వీరి నటజీవితమును చవిచూచి వెళ్ళినవారే! నేటి సుప్రసిద్ధ సంగీత దర్శకులు శ్రీ తాతినేని, ఆనాటి వీరి సమాజంలో హార్మోనిస్టు! మరొక ప్రఖ్యాతసంగీతదర్శకులు పెండ్యాల సూర్యనారాయణగారితో కలిసి స్త్రీ పాత్రలు అభినయించారు. సూర్యనారాయణగారినటనా సామర్థ్యానికి మెచ్చి, వీరి కోసమని వీరు నటించాలని శ్రీ విశ్వనాథ సత్యనారాయణ "గుప్త పాశుపతము" అనే నాటకం రచించారు

ఈ మహానుభావుడి నటజీవితమంతా ప్రధానంగా "హరిశ్చంద్ర కాటిసీను"తోనే శోభించిపోయింది. వీరి ప్రదర్శన లన్నింటిలో ఎప్పుడూ అదే "హైలైట్". చివరికి ఆ భౌతికకాయం చితాగ్నిపై భుగభుగలాడుతూ వుండగా, వారి ఐదవ కుమారుడు (మొత్తం వారికి ఎనిమిదిమంది కుమారులు, భార్య వున్నారు), చిరంజీవి శేఖర్—

మాయామేయ జగంబె నిత్యమని సంభావించి, మోహమ్మునన్
నా యిల్లాలని నా కుమారుడని, ప్రాణంబుండునందాక ఎంతో యల్లాడిన యీ శరీర మిపుడిందున్ కట్టెలన్ కాలుచో
ఆ ఇల్లాలును రాదు, పుత్రుడును తోడై రారు తప్పింపగన్.

అనే పద్యాన్ని ఎలుగెత్తి గాద్గదికంగా ఆలాపిస్తూవుండగా, అక్కడ చేరిన వారందరం, ఆ పద్యం ఆయనే ఆలాపిస్తున్నాడా అనే భ్రాంతిలో, ఆ మహా స్మశానరంగ స్థలంమీద పాత్రలమైన మేము కూడా ఆపుకోలేక, ప్రక్క నెండిపోయి ప్రవహిస్తున్న కృష్ణకి వరదలొస్తాయా అన్నంతగా దుఃఖించాము. ఆ మహానటుడి జీవిత "ఆఖరి సీను" కూడా అలా ఆయన 'నాటక సీను'తో ముడిపడిపోయింది. ఇలా నిజ జీవితమూ, నట జీవితమూ ముడిపడిపోయిన కళాకారులెంతమంది ఉంటారు?

—విశ్వనాథ పావనిశాస్త్రి